

భూ రీసర్వేను జాయింట్ కలెక్టర్ పరిశీలన

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: ప్రభుత్వం నిర్వహిస్తున్న శాశ్వత భూ హక్కు పథకంలో భాగంగా మండలంలోని పోతంగి పంచాయతీ ఉయ్యాలగూడ గ్రామంలో సోమవారం రెవెన్యూ అధికారులు చేపట్టిన భూరీ సర్వేను అల్లూరి జిల్లా జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే తీరుపై ఆ గ్రామ గిరిజనులను అడిగి తెలుసుకున్నారు. గిరిజనుల్లో ఎటువంటి గొడవలు ఏర్పడకుండా రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ముజీబ్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ జి.కామరాజు, సర్వేయర్ వెంకటేశ్వరరావు, కమ్యూనిటీ సర్వేయర్ సద్దు, వీఆర్వో ఝాన్సీ లక్ష్మి, ఎస్.రమేష్ పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న జెసి

ఎన్నికల బరిలో 37మంది

- పట్టభద్రుల శాసన మండలి స్థానానికి ముగ్గురు నామినేషన్ల ఉపసంహరణ
- మొత్తం ఓట్లు 289214
- పోలింగ్ కేంద్రాలు 331 - మార్చి 13న పోలింగ్
- జిల్లా ఎన్నికల అధికారి మల్లికార్జున వెల్లడి



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గానికి పోటీలో 37 మంది అభ్యర్థులు ఉన్నట్లు రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున వెల్లడించారు. తన కార్యాలయంలో ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం నియోజకవర్గానికి సంబంధించి పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలపై ఆయన సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బొడ్డె చంద్రశేఖర పద్మావతి, ఈర్ల శ్రీరామమూర్తి, గూనూరు మళ్లునాయుడులు పోటీ నుంచి ఉప సంహరించుకున్నట్లు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలు ఇలా..

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి 331 పోలింగు కేంద్రాలు ఉండగా శ్రీకాకుళం జిల్లాలో 59, విజయనగరంలో 72, పార్వతీపురం మన్యంలో 24, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 15, విశాఖపట్నంలో 112, అనకాపల్లిలో 49 పోలింగు కేంద్రాలు ఉన్నట్లు వివరించారు. పోలింగు సిబ్బందికి ఈ నెల 28న, తిరిగి రెండో సారి మార్చి 7న శిక్షణ ఉంటుందన్నారు. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు బూత్ స్థాయి అధికారులతో ఓటరుకు స్లిప్పులు, ఓటరుకు సంబంధించిన సమాచారం అందిస్తారని, ఆబ్సెంటీ, షిఫ్టెడ్, డూప్లికేట్ ఓటరు జాబితాను ప్రెసైడింగ్ ఆఫీసర్లకు మెటీరియల్‌తో అందజేస్తామని తెలిపారు.

ఓటర్లు ఇలా..

ఉత్తరాంధ్ర పట్టభద్రులకు సంబంధించి 2,89,214 ఓట్లు ఉండగా శ్రీకాకుళం జిల్లాలో 52256 మంది, విజయనగరం జిల్లాలో 58502 మంది, పార్వతీపురం మన్యం జిల్లాలో 18520 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 11525 మంది, విశాఖపట్నం జిల్లాలో 105697 మంది, అనకాపల్లి జిల్లాలో 42714 మంది ఉన్నట్లు పేర్కొన్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు

ఎన్నికలకు సంబంధించి విశాఖపట్నం జిల్లాలో 15 మంది సెక్టార్/జోనల్ ఆఫీసర్లు, 15 మంది రూట్ ఆఫీసర్లు, 112 మంది బూత్ స్థాయి ఆఫీసర్లు, 143 మంది ప్రెసైడింగ్ ఆఫీసర్లు, 443 మంది ఇతర పోలింగ్ ఆఫీసర్లు, 112 మంది సూక్ష్మ పరిశీలకులు, 112 వెబ్ కాస్టింగ్ వెబ్ కెమెరాలు (అన్ని పోలింగ్ కేంద్రాల్లో), ఒక మండలానికి 11 మంది ఫ్లైయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఆరు జిల్లాల్లో సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. అభ్యర్థుల పేర్లు ఆల్ఫాబెటికల్ ఆర్డర్‌లో పెట్టి ఎన్నికల కమిషన్ పరిశీలనకు పంపించామన్నారు.

పోలింగ్ సమయం

పోలింగు మార్చి 13న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సాగుతుందని, 4 గంటల తర్వాత వరుసలో ఉన్న వారికి వీడియో తీసి వారికి టోకెన్లు అందిస్తారని, వారు మాత్రమే ఓటు వేస్తారని తెలిపారు. పోలింగు పూర్తయిన తరువాత సంబంధిత స్ట్రాంగ్ రూంలలో భద్రపరుస్తారని, మరుసటి రోజున పోలీసు బందోబస్తుతో ఆయా జిల్లాల నుంచి తీసుకువచ్చి స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలోని స్ట్రాంగ్ రూంలో భద్రపరుస్తారని తెలిపారు. మార్చి 16న స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఓట్ల లెక్కింపునకు 28 లెక్కింపు టేబుల్స్, ఒక రిటర్నింగ్ అధికారి టేబుల్ సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటలకే లెక్కింపు ప్రారంభమవుతుందని వివరించారు. వీడియోగ్రఫీ సమక్షంలో లెక్కింపు ప్రారంభమవుతుందని చెప్పారు. వివిధ పార్టీల అభ్యర్థులు, నాయకులు, స్వతంత్ర అభ్యర్థులు వ్యక్తిగత దూషణలకు పోరాదని అన్నారు. ఒక వ్యక్తి అనుమతి లేకుండా ఆయన ఇంటినిగానీ, ఇంటి ఆవరణాన్నిగానీ ఎన్నికల ప్రచారానికి ఉపయోగించరాదన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయరాదని తెలిపారు. పోలింగు కేంద్రాలకు వంద మీటర్ల పరిధిలో ప్రచారం నిషేధమని, ఎన్నికల సమయానికి 48 గంటల ముందు ప్రచారం నిలిపివేయాలని అన్నారు. పోలింగు కేంద్రాలకు పోలింగు ఏజెంట్లుగా ఒకరిని మాత్రమే అనుమతిస్తామని తెలిపారు.

పోలీసు బందోబస్తు

నగర పోలీసు కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ మాట్లాడుతూ పట్టభద్రుల ఎన్నికలు, ఓట్ల లెక్కింపునకు సంబంధించి పూర్తి స్థాయి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 1162 మంది పోలీసులను వినియోగిస్తున్నట్లు తెలిపారు. పోలింగు రోజున 840 మందిని వినియోగిస్తున్నట్లు వివరించారు. 112 పోలింగు స్టేషన్లు, 43 పోలింగు లొకేషన్లు, 15 రూట్ మొబైల్స్ ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద అక్కడ ఉన్న సమస్యల ఆధారంగా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సెస్, స్ట్రైకింగ్ ఫోర్సెస్ ఏర్పాటు చేశామన్నారు. జిల్లా రిజర్వ్ ఫోర్స్‌ను అందుబాటులో ఉంచుతామన్నారు. ఎన్నికలు పూర్తయిన తరువాత స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం వద్ద, స్ట్రాంగ్ రూం వద్ద సెంట్రల్ పారామిలిటరీ ఫోర్స్‌తో బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. లెక్కింపు రోజున పారామిలిటరీ దళాలను అందుబాటులో ఉంచుతామన్నారు. తొలుత కలెక్టరేట్ సమావేశ మందిరంలో అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నియమావళిని తెలియజేశారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన అభ్యర్థులు, నాయకులు, స్వతంత్ర అభ్యర్థులు పాల్గొన్నారు.

గిరిజనుల ప్రాణాలకు ఏదీ భరోసా?

గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు

సెంట్రల్ జైలులో మృతి చెందిన రాజాబాబు కుటుంబానికి పరామర్శ



రాజాబాబు కుటుంబాన్ని పరామర్శిస్తున్న గిరిజన సంఘం నేతలు

ప్రజాశక్తి- అడ్డతీగల : ఇంట్లో, గ్రామాల్లో ఉన్నా, పాఠశాల, హాస్టళ్లకు వెళ్లినా, చివరకు సాధారణ కేసుల్లో శిక్ష పడి జైలుకు వెళ్లినా, ఎక్కడైనా గిరిజన ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోందని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు ఆవేదన, ఆక్రోశం వ్యక్తం చేశారు. సోమవారం రాజమండ్రి జైలులో అనుమానాస్పదరీతిలో మృతి చెందిన అడ్డతీగల మండలం బొడ్లంక పంచాయతీ అచీపేట గ్రామానికి చెందిన కన్నోజీ రాజుబాబు కుటుంబాన్ని రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, రాజవొమ్మంగి మండల కార్యదర్శి కొండ్ల సూరిబాబుతో కూడిన గిరిజన సంఘం నేతల బృందం పరామర్శించింది. బాధితులతో మాట్లాడి వారి బాధలను అడిగి తెలుసుకుని, వారిలో మనోధైర్యాన్ని నింపారు.

ఈ సందర్భంగా మృతుడు రాజాబాబు తల్లి, ఇతర కుటుంబసభ్యులు మాట్లాడుతూ, ఈ నెల 23ర రాజాబాబు తమతో మాట్లాడాడని, మరుసటి రోజునే ఆయన చనిపోయినట్లు రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి సమాచారం వచ్చిందని వివరించారు. తన కొడుకు రాజాబాబును చంపేశారని, మెడపై గాయాలు, రక్కులు ఉన్నాయని అలాగే రెండోరోజున చూస్తే వీపుభాగాన రక్తం కారి ఉందన్నారు. మృతిపై తాము అనుమానం వ్యక్తం చేసి, ఎంతగా గగ్గోలు పెట్టినా, మీడియా వాళ్ళు సెంట్రల్ జైల్ అధికారులే చెప్పింది రాసుకుని, పేపర్లలో అదే ప్రచురించారని ఆవేదన వ్యక్తం చేశారు. అసాధారణ మరణమని స్పష్టంగా తెలుస్తున్నా ఎవరూ కనీసం అనుమానాస్పద మృతిగానైనా రాయకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు దీనిపై జోక్యం చేసుకుని తమకు న్యాయం చేసేలా చూడాలని గిరిజన సంఘం నేతల వద్ద వాపోయారు.

ఈ సందర్భంగా లోతా రామారావు మాట్లాడుతూ, ఏజెన్సీలోని గిరిజనులకు ఎక్కడున్నా ప్రాణాలకు రక్షణ లేకుండా పోవడం బాధాకరమన్నారు. రాజాబాబు మృతిపై వారి కుటుంబీకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో సమగ్ర విచారణ జరిపి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. మన్యవాసుల మరణాలను నియంత్రించేందుకు ప్రభుత్వం, అధికార యంత్రాంగంపై తీవ్ర ఒత్తిడి తెచ్చేందుకు ఆదివాసీ సంఘాలన్నీ పోరాటానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.

బకాయి వేతనాలపై ఆందోళన



ప్రజాశక్తి- అరకులోయ రూరల్: అరకులోయ ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అరకులోయ ఏరియా ఆసుపత్రిలో వద్ద శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కో కన్వీనర్ అమర్ మాట్లాడుతూ, సెక్యూరిటీ సిబ్బంది, శానిటేషన్ వర్కర్లకు మూడు నెలల నుండి జీతాలు చెల్లించ లేదన్నారు. జీవో 549 ప్రకారం శానిటేషన్ వర్కర్లకు రూ.16 వేలు జీతాలు చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించినా సంస్థ యాజమాన్యం పారిశుధ్య కార్మికులకు రూ.10,700, సెక్యూరిటీ గార్డులకు రూ. 8400 మాత్రమే చెల్లిందని పేర్కొన్నారు.పారిశుధ్య కార్మికులకు పీఎఫ్ రూ.1800 పైబడి చెల్లించాల్సి ఉండగా రూ.1175లు మాత్రమే ఇస్తూ మోసం చేస్తున్నారని అన్నారు. పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు పలు సమస్యలతో సతమతం అవుతున్నా ప్రభుత్వం, యాజమాన్యం పట్టించుకోక పోవడం సరికాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు ద్రౌపది, కృప, దసుధ, సూర్య, జయంతి, కోటి, సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం



రక్తదానాన్ని పరిశీలిస్తున్న పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి- చింతూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచనలతో కాలేజీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో పాడేరు రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు సౌజన్యంతో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని చింతూరు ఐటిడిఎ ఇన్‌ఛార్జి పిఒ సూరజ్ గనోరే ప్రారంభించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ, సంపూర్ణ ఆరోగ్య వంతులు రక్తదానం చేయడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో ప్రాణదానం చేసిన వారవుతారన్నారు. అలాగే రక్తదానం చేయడం వల్ల దాతల ఆరోగ్యం కూడా మెరుగవుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రత్న మాణిక్యం మాట్లాడుతూ, ఈ శిబిరంలో 50 మందికి బ్లడ్ గ్రూపింగ్ చేయగా 15 మంది రక్తదానం చేసారన్నారు.కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సోసైటీ పాడేరు శాఖ ఉపాధ్యాక్షులు ఎస్. గంగరాజు, కార్యదర్శి జి.ఈశ్వరరావు, జిల్లా కో ఆర్డినేటర్ ఎన్. కోటేశ్వరరావు, చింతూరు ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ ఎన్‌వి. కోటిరెడ్డి, కళాశాల ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి.హారతి , వైస్ ప్రిన్సిపల్ జి. వెంకట్రావు, ఎం. శేఖర్, ఎన్. రమేష్, ఇతర అధ్యాపకులు, రంపచోడవరం బ్లడ్ బ్యాంకు, చింతూరు ఏరియా హాస్పిటల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెఎసి చైర్మన్ ఎవి.నాగేశ్వరరావు

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్

ఉద్యోగుల సమస్యలపై పోరాటం ఉధృతం

- జెఎసి చైర్మన్ ఎవి.నాగేశ్వరరావు

ప్రజాశక్తి అరకులోయ రూరల్: ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగ, ఉపాధ్యాయ, లెక్చరర్ల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటం ఉధృతం చేస్తామని జేఏసీ చైర్మన్ ఏవి నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం అరకువేలి గిరిజన సంఘం కార్యాలయంలో కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు కిల్లో ఓనాది అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ ఏవి నాగేశ్వరరావు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులపై చిన్న చూపుతో వ్యవహరిస్తూ సమస్యల పరిష్కారానికి చొరవ చూప లేదన్నారు. చాలీచాలని జీతాలు ఇచ్చి గొడ్డు చాకిరి చేయిస్తుందని విమర్శించారు. ప్రభుత్వం ప్రచార ఆర్భాటం చేస్తున్నప్పటికీ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో చేయడంతో విఫలమైందన్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయమని సుప్రీంకోర్టు ఆదేశించినప్పటికీ ఎక్కడా అచరణకు నోచుకోలేదన్నారు. గురుకులాల్లో పనిచేస్తున్న లెక్చరర్ల సమస్యలపై కనీసం ప్రభుత్వం వినడానికి సిద్ధంగా లేదని విమర్శించారు.ఔట్సోర్సింగ్ నుండి కాంట్రాక్ట్‌గా మార్చాలని కోరినా కనీసం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఏపీ టూరిజం లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం అమలు చేయలేదని పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు.ముఖచిత్ర యాప్‌ను తక్షణమే రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ శెట్టి నాగరాజు, గురుకులం ఉపాధ్యాయ లెక్చరర్ సంఘం జిల్లా కార్యదర్శి గొల్లూరి రాజు, విద్యుత్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు అప్పలస్వామి, వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల సంఘం నాయకులు వెంకటరమణ, ఏపీ టూరిజం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గంగరాజు,హెల్త్ వాలంటరీ సంఘం అధ్యక్షులు గంగాధర్, భాష వాలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షులు కుమారి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి బాలదేవ్, సిఐటియు జిల్లా కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, నాయకులు కొండలరావు, రాజు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

1న ముంచంగిపుట్టు మండల సమావేశం

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు: మార్చి 1వ తేదీన మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అరిసెల సీతమ్మ అధ్యక్షతన నిర్వహిస్తామని ఎంపిడిఒ కిరణ్ కుమార్ స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ మేకు ప్రజాప్రతినిధులకు ఆహ్వాన పత్రాలను అందజేశారు. గత సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యలపై వెలువెత్తిన ప్రశ్నలకు సంబంధిత అధికారులు వివరాలతో హాజరు కావాలని కోరారు.

నేడు యుటిఎఫ్ మండల మహాసభ

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: మండల కేంద్రంలో ఈనెల 28న యుటిఎఫ్ మండల మహాసభను నిర్వహిస్తున్నట్లు స్థానిక ఆ సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.చంద్రశేఖర్, ఎస్.కన్నయ్య తెలిపారు. సోమవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యచరణను రూపొందిస్తామన్నారు.

సీలేరు పిఎస్‌పి నిర్మాణంపై

ఏప్రిల్ 1న ప్రజాభిప్రాయ సేకరణ

ఎపి జెన్‌కో ఎస్‌ఇ (సివిల్) ప్రశాంత్‌కుమార్



వివరాలు వెల్లడిస్తున్న జెన్‌కో ఎస్‌ఇ ప్రశాంత్‌కుమార్

ప్రజాశక్తి -సీలేరు: సీలేరు కాంప్లెక్స్ పరిధి సీలేరు జల విద్యుత్ కేంద్ర సమీపంలో నూతనంగా నిర్మించనున్న 1350 మెగావాట్ల సామర్థ్యం గల పంపు స్టోరేజ్ ప్రాజెక్టు (ఎత్తిపోతల పథకం)పై ఏప్రిల్ ఒకటో తేదిన ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు ఎపి జెన్‌కో ఎస్‌ఇ(సివిల్) కెకెవి.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు విద్యుత్‌సౌథ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. సీలేరులో ఎపి జెన్‌కో ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణకుసంబంధించి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రాజెక్టు పరిధిలోని సీలేరు, దారకొండ, దుప్పిలివాడ, గుమ్మరేవులు, బొడ్డగండి పంచాయతీల్లోని నిర్వాసితులకు రెవెన్యూ అధికారుల ద్వారా సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయని ఎస్‌ఇ ప్రశాంత్‌కుమార్ వెల్లడించారు.

ప్రాజెక్టు నిర్మాణ ప్రతిపాదన ఇలా...

కాగా సీలేరు కాంప్లెక్స్ పరిధి సీలేరు జల విద్యుత్ కేంద్ర సమీపంలో నూతనంగా నిర్మించనున్న 1350 మెగావాట్ల సామర్థ్యం గల పంపు స్టోరేజ్ ప్రాజెక్టు(ఎత్తిపోతల పథకం) నిర్మాణానికి 2018లో తెలుగుదేశం పార్టీ హయాంలో ప్రతిపాదన తెరపైకి తెచ్చింది. ఏపి జెన్‌కో హైడిల్ డైరెక్టర్ ఆదిశేషు అప్పట్లో ప్రాథమిక సర్వే నిర్వహించారు. అనంతరం (వ్యాప్ కోస్) సంస్థకు ప్రాజెక్టు సర్వే పనులు బాధ్యతలు అప్పగించారు. భూగర్భం (అండర్ గ్రౌండ్)లో నిర్మించే ప్రాజెక్టు కావడంతో వ్యాప్‌కోస్ వారు సీలేరు జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి అనంతరం విడుదలయ్యే నీరు డొంకరాయి జలాశయానికి చేరే మార్గంలో శాండ్‌కొరి వద్ద రబ్బర్ డ్యాం నిర్మించి, అక్కడ నుంచి ఒక్క టిఎంసి నీటిని మోటార్ల ద్వారా వెనక్కి పంపింగ్ చేసేలా డిజైన్‌కు రూపకల్పన చేశారు. దీనికోసం శాండ్‌కోరి నుంచి బూసుకొండ పార్వతినగర్ వరకు అండర్ గ్రౌండ్ పైప్‌లైన్‌ను ఏర్పాటు చేస్తారు. దీనికోసం భూగర్భంలో 60 నుంచి 140 అడుగులు వరకు రాక్ పటిష్టత ఎలా ఉందనే కోణంలో సర్వేసంస్థ వ్యాప్‌కోస్ సీలేరు సమీపంలో ఉన్న గుంటవాడ జలాశయం నుంచి శాండ్‌కోరి వరకు అండ గ్రౌండ్లో పైప్ లైన్ వచ్చే మార్గంలో దాదాపు వంద చోట్ల డ్రిల్లింగ్ వేసి నమూనాలు సేకరించి పరిశోధన చేశారు. పంపు స్టోరేజ్ ప్రాజెక్టు ఎక్కడ నిర్మించాలి, విద్యుదుత్పత్తి అనంతరం విడుదలయ్యే నీటిని ఏ విధంగా గుంటవాడ జలాశయానికి మళ్లించాలనే దిశగా పరిశోధన చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి 2145 హెక్టర్ల భూమి అవసరం ఉండడంతో రెవెన్యూ సిబ్బందితో సర్వే నిర్వహించారు. సర్వేర్‌లో శాండ్ కోరిలో 32.14 హెక్టార్లు, బుషికొండలో 38.71 హెక్టార్లు, పార్వతినగర్‌లో 83 ఎకరాల భూమి ఉన్నట్లు గుర్తించారు. 2021 ఫిబ్రవరి 20న దుప్పిలివాడ పంచాయతీ బుషికొండ గ్రామంలో పార్వతినగర్, వలసగెడ్డ,రుషికొండ, సీలేరు తదితర గ్రామాలకు చెందిన వెయ్యి మందికి పైగా నిర్వాసితులతో సమావేశం నిర్వహించి చర్చించారు. అప్పటి ఎపి జెన్‌కో ఎస్‌ఇ సివిల్ రామకోటిలింగేశ్వర రావు, జికె.వీధి తహశీల్దార్, ఇతర రెవెన్యూ అధికారులు మొదటివిడత ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టగా, ఈ ప్రాజెక్టును ఎవరూ వ్యతిరేకించలేదు. అయితే భూములు కోల్పోతున్న నిర్వాసిత గిరిజనులకు మెరుగైన ప్యాకేజీ,భూమికి భూమి, వసతికి వసతి, ఇతర పరిహారాలు చెల్లించాలని మాత్రం కోరారు. ప్రాజెక్టు నిర్మాణానికి ప్రజల నుంచి సానుకూలత వ్యక్తమైన నేపథ్యంలో పర్యావరణ అనుమతుల కోసం తుది ప్రజాభిప్రాయ సేకరణకు తుది అనుమతులు కోరుతూ జిల్లా అధికారులకు ఎపిజెన్‌కో నుంచి తుది నివేదిక వచ్చిన నేపథ్యంలో ఏప్రిల్ ఒకటిన తుదిప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని ఆదేశాలు వెలువడ్డాయి.



అప్పట్లో వ్యాప్‌కోన్ సంస్థ నిర్వహిస్తున్న సర్వే (ఫైల్‌ఫోటో)

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో 'ఆదిత్య' విద్యార్థుల ప్రతిభ



బహుమతులు అందుకుంటున్న కరాటే విజేతలు

ప్రజాశక్తి -ఎటపాక: ఓరుగల్లులో నిర్వహించిన జాతీయస్థాయి సుమన్ షాటోఖాన్ ఇంటర్నేషనల్ కరాటే పోటీలలో తోటపల్లి శ్రీఆదిత్య పాఠశాల విద్యార్థులు నలజాల హర్షిత్, అపకా అశ్విన్‌దొర, అపకా జ్యోష్ణవి ముగ్గురు చిన్నారులు అద్భుతమైన ప్రదర్శన కనబరిచి గ్రీన్ బెల్ట్, బహుమతులు సాధించారని కరాటే మాస్టర్ ముత్తు తెలిపారు. కోచ్ ముత్త సారథ్యంలో జాతీయస్థాయిలో బహుమతులు సాధించిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ వెంకట్, ఉపాధ్యాయులు అభినందించారు.

మెరుగైన వైద్యసేవలు అందించండి

ప్రజాశక్తి - రంపచోడవరం :గిరిజన ప్రాంతంలోని ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు రంపచోడవరం ఏజెన్సీలోని ఏడు మండలాలలో కొత్తగా నియమితులైన మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు కృషి చేయాలని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే ఆదేశించారు, సోమవారం స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో 75మంది హెల్త్‌ప్రొవైడర్ల ఏడు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతూ ఏజెన్సీలోని ప్రతి గ్రామానికి వెళ్లి, ప్రజలకు అందుబాటు లో ఉండి వైద్య సేవలు అందించే బాధ్యత అందరిపై ఉందన్నారు.ఏడు రోజుల శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో ఆచరణలో పెట్టి, గ్రామ సచివాలయాల పరిధిలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్లలో నివాసముండి ప్రజలకు సేవచేయాలని సూచించారు. గ్రామాల్లో వృద్ధులు, గర్భిణులు, బాలింతలు చిన్నపిల్లలతోపాటు ఆశ్రమ పాఠశాలలు, మండల పరిషత్, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, ఇతర విద్యాలయాలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. శిక్షణ పొందిన ప్రొవైడర్లందరికీ ప్లేస్‌మెంట్ ఇచ్చామని, ఏమైనా సమస్యలుంటే ఎడిఎంహెచ్ఒను సంప్రదించాలని సూచించారు. మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ల వద్ద 64 రకాల మందులు, 14 రకాల టెస్టులు చేసే సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని, ఫ్యామిలీ ఫిజీషియన్, టెలీమిషన్ విధానంలో ఉన్నతస్థాయి వైద్యులను సంప్రదించి, రోగుల వ్యాధులకు సంబంధించి, మందులుఅందించాల్సి ఉంటుందన్నారు. ఏజెన్సీలోని గిరిజనులకు చిత్తశుద్ధితో సేవలు అందించి మంచి పేరు తెచ్చుకునే విధంగా పనిచేయాలని సూచించారు.ఎడిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ టి. అనుష, డాక్టర్ ఆనంద్ సత్యతేజ్, డాక్టర్ కె. రాధిక, ఎంపిహెచ్ఒ. పీటర్, ఎంఎల్‌హెచ్‌పిలు పాల్గొన్నారు.



కొత్తగా నియమితులైన హెల్త్ ప్రొవైడర్లతో పిఒ సూరజ్



మాట్లాడుతున్న జెడ్పిటిసి గంగరాజు

పోరాటంతోనే సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి-అనంతగిరి: మాతృభాష వాలంటీర్లను రెన్యూవల్ చేసేందుకు చేపట్టిన పోరాటంతోనే తిరిగి తీసుకున్నారని జెడ్పిటిసి దీసరి. గంగరాజు తెలిపారు. స్థానిక గిరిజన సంఘం కార్యాలయం వద్ద సోమవారం భాష వాలంటీర్ల సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ, తొలగించిన మాతృభాష వాలంటీర్లను కొనసాగించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఐటిడిఏ పాలకవర్గం, జిల్లా పరిషత్ కార్యాలయంలో ఈ విషయమై గళం విప్పామని తెలిపారు. ప్రైమరీ పాఠశాలలో చదివే విద్యార్థులకు మాతృభాష బోధనతో నాణ్యమైన బోధన అందుతుందన్నారు. సంఘంగా ఏర్పడి సమస్య పరిష్కారానికి పోరాటం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు కుమారి, టోకూరు సిపిఎం సర్పంచ్ కె.మొస్యే, సిపిఎం మండల కార్యదర్శి ఎస్ నాగులు, నాయకులు జి.దేవన్న, గిరిజన సంఘం మండల ఉపాధ్యక్షులు జె. సుబ్బారావు పాల్గొన్నారు.



పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న నేతలు

పాఠశాలలు మూసేస్తే ఊరుకోం

గిరిజన మహిళా సంఘం అధ్యక్షురాలు విజయ

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని కింజాయి పుట్టు పంచాయతీ కుమిడిపుట్టు గ్రామం లోనీ ప్రాథమిక పాఠశాలల్లో పిల్లలు తక్కువగా ఉన్నారనే నెపంతో మూసివేస్తే ఊరుకోమని గిరిజన మహిళా మండల సంఘం అధ్యక్షురాలు విజయ తెలిపారు. సోమవారం పాఠశాల ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన మహిళా సంఘం అధ్యక్షురాలు ఎస్.విజయ మాట్లాడుతూ, మండలంలో ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలు మూసి వేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తుందని మండిపడ్డారు. జాతీయ విద్యా విధానం పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. గిరిజన ప్రాంతంలో విద్యార్థుల తక్కువ ఉన్నారనే కారణంతో పాఠశాలలు మూసివేస్తే పిల్లలు చదువుకున్న దూరమై డ్రాప్ ఓట్ల సంఖ్య పెరుగుతుందన్నారు. రాజ్యాంగం ప్రకారం 6నుండి 14 సంవత్సరాల పిల్లలకు ఉచిత నిర్బంధ విద్య అందించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ 1 సత్యనారాయణ, గిరిజన మహిళా సంఘం సభ్యులు పూర్ణిమ, పోర్జిమా, కలిమోని తదితరులు పాల్గొన్నారు.



కె.కోటపాడు మండలం లంకవానిపాలెంలో ప్రచారం చేస్తున్న ప్రజాసంఘాల నేతలు



చోడవరంలో మాట్లాడుతున్న ఎల్ఐసి యూనియన్ నేత అజయ్ కుమార్

కోరెడ్ల రమాప్రభ గెలుపునకు విస్తృత ప్రచారం

ప్రజాశక్తి -యంత్రాంగం

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలంటూ ఉమ్మడి విశాఖ జిల్లాలో జోరుగా ప్రచారం సాగుతోంది. ప్రజాసంఘాల నాయకులు, కార్మికులు సోమవారం పట్టభద్రుల ఓటర్లను కలిసి ఉత్తరాంధ్ర సమస్యలపై గళమెత్తేందుకు రమాప్రభకు అవకాశం ఇవ్వాలని కోరారు.

కె.కోటపాడు : ప్రజల సమస్యలపై ప్రశ్నించే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిని డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ మండలంలోని లంకవానిపాలెం గ్రామంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి గండి నాయినిబాబు, ప్రజాసంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేవుడు ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రజా సమస్యలపై అవగాహన, పోరాడే స్వభావం ఉన్న రమాప్రభకు ఉత్తరాంధ్ర జిల్లాల్లో 250 ప్రజాసంఘాలు బలపరుస్తున్నాయన్నారు. రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని సర్పంచ్ వి. దొరబాబుతోపాటు పట్టభద్రులు ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వనము సూర్యనారాయణ పాల్గొన్నారు.

చోడవరం : ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని ఎల్ఐసి యూనియన్ రాష్ట్ర నాయకులు అజయ్ కుమార్ కోరారు. సోమవారం స్థానిక ఎల్ఐసి ఆఫీసులో కార్యాలయంలో ఏజెంట్ యూనియన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏజెంట్ ఎఐఎ నాయకులు నాగరాజు మోహన్ శ్రీనివాస్, శంకర్, ప్రేమ చంద్రశేఖర్, లోవరాజు పాల్గొన్నారు.



అనంతగిరి, టోకూరులో ప్రచారం నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నేతలు

అనంతగిరి: ప్రజా సంఘాలు బలపరిచిన పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ సోమవారం మండలంలోని కొండిభ పంచాయతీ, అనంతగిరి, టోకూరులో ప్రజా సంఘాల నేతలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. స్థానిక జెడ్పిటిసి దీసరి గంగరాజు, సర్పంచ్ కె. మొత్తలు, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ, 250 ప్రజా సంఘాలు బలపరిచిన రమాప్రభను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల నాయకులు ఎస్. నాగులు జె. సుబ్బారావు ఎస్. చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు ఉపాధ్యాయులకు వెల్ఫేర్ బోర్డు

ఎన్నికల ప్రచారంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ



ప్రయివేటు విద్యా సంస్థల ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న రమాప్రభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రయివేటు విద్యాసంస్థల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటుకు కృషి చేస్తానని ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ తెలిపారు. సోమవారం విజయనగరంలోని పలు విద్యాసంస్థల్లోని ఉద్యోగులు, ఉపాధ్యాయులను కలిసి మాట్లాడారు. ఉపాధ్యాయులు, ఉద్యోగుల తరపున శాసనమండలిలో పోరాడుతున్నది కేవలం పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమేనని చెప్పారు. అటువంటి ఫ్రంట్ తనను బలపర్చడం గర్వకారణమన్నారు. ఇప్పటి వరకు సామాజిక సమస్యలపై పోరాడానని, పట్టభద్రులు అవకాశం కల్పిస్తే చట్టసభలో ఉత్తరాంధ్ర అభివృద్ధి, ఇతర సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ప్రయివేట్ విద్యాసంస్థల సిబ్బంది హక్కుల కోసం పనిచేస్తానని చెప్పారు. వారందరికీ గుర్తింపు కార్డుల మంజూరు కోసం కృషి చేస్తానన్నారు. ప్రజల గొంతుకనై పనిచేస్తానని, మొదటి ప్రాధాన్యత ఓటు వేసే గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి కె.సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి వెంకటేష్, పి.రామ్మోహన్, నాయకులు పావని, రామకృష్ణ, లావణ్య, సంధ్య, బాలాజీ, సోమేశ్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.



హుకుంపేట మండలం శోభకోట పంచాయతీలో ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తున్న సిబ్బంది

త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు

4 సర్పంచ్, 66 వార్డులకు కొద్ది రోజుల్లో నోటిఫికేషన్

- డిఎల్ పిఒ కుమార్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఎపి రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్థానిక సంస్థల్లో ఖాళీలు ఏర్పడిన స్థానాలకు త్వరలో ఎన్నికలు నిర్వహిస్తామని, ఆయా స్థానాలకు సంబంధించిన ఓటర్ల జాబితాను ప్రచురించినట్లు డిఎల్పిఒ పిఎస్ కుమార్ తెలిపారు. జిల్లాలో ఖాళీగా ఉన్న సర్పంచ్, వార్డు మెంబర్ల స్థానాలకు ఎన్నికలను త్వరలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. జికె వీధి మండలంలో సీలేరు, హుకుంపేట మండలంలోని శోభకోట, పెదబయలు మండలంలో కోడాపల్లి, రంపచోడవరం మండలంలోని ఆకూరు పంచాయతీల్లో 4 సర్పంచులతో పాటు, ఆయా మండలాల్లో ఖాళీగా ఉన్న 66 వార్డు సభ్యుల పదవులకు త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు వీలుగా 5 జనవరి 2023న ప్రచురించిన అసెంబ్లీ ఓటర్ల జాబితా ఆధారంగా పంచాయతీల ఓటర్ల జాబితాను ప్రచురించామని పేర్కొన్నారు.



కాలి దగ్ధమైన ఇల్లు

ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి -హుకుంపేట: ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధమై రూ.5 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గత్తుం గ్రామానికి చెందిన పాంగి మత్యరాజు ఇల్లు ఆదివారం రాత్రి ఖాలి బూడిదైంది. ఈ అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో ఎవరు ఇంటిలో లేక పోవడంతో ప్రాణాపాయం తప్పింది. గ్రామంలో ఆ రోజు శుభకార్యం జరగడంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇంటికి వెళ్లారు. ఆర్ఐ రంగారావు, వీఆర్వో సింహాచలం ఇంటిని పరిశీలించి సుమారుగా రూ.5 లక్షలు. ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు.

అప్పన్న సన్నిధిలో.. కరణం మల్లేశ్వరి దంపతులు

ప్రజాశక్తి-సింహాచలం: ఒలింపిక్స్ వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో కాంస్య పతక విజేత కరణం మల్లేశ్వరి దంపతులు సోమవారం సింహాద్రి అప్పన్నను దర్శించుకున్నారు. వీరికి ఆలయ సూపరింటెండెంట్ నిర్ధామనాయుడు స్వాగతం పలికారు. మల్లేశ్వరి దంపతులు ముందుగా కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. అధికారులు స్వామివారి ప్రసాదాన్ని అందించారు.



దీక్షల్లో కూర్చున్న స్టీల్ ఎంఎంఎస్ఎం, ఎస్టిఎం విభాగాల కార్మికులు

'ఉక్కు' పరిరక్షణకు ఐక్య ఉద్యమం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఐక్య ఉద్యమం చేపట్టనున్నట్టు విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ తెలిపారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 746వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ ఎంఎంఎస్ఎం, ఎస్టిఎం విభాగాలకు చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నూటికి నూరు శాతం అమ్మాలనే నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. త్యాగాల పునాదుల మీద ఏర్పాటైన ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవడం కోసం ఎంతటి త్యాగానికైనా కార్మికవర్గం సిద్ధంగా ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమం రాజకీయ పోరాటంగా మారాల్సిన అవసరముందన్నారు. రెండేళ్లుగా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నా మోడీ సర్కారు స్పందించకపోవడం దారుణమన్నారు. ఇలానే వ్యవహరిస్తే రానున్న కాలంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. దీక్షల్లో పోరాట కమిటీ నేతలు జె.రామకృష్ణ, జి.ఆనంద్, డి.దేముడు, డి.రమేష్, జివి.రమణారావు, మహ్మద్, ఆర్.సూరిబాబు, ఎం.సుబ్బారావు, ఎం.మాధవరావు పాల్గొన్నారు.

19న జర్నలిస్టుల ఉగాది సంబరాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఎపి బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ సంయుక్తాధ్వర్యాన మార్చి 19న ఉగాది సంబరాలను ఘనంగా నిర్వహించనున్నట్లు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, ఎపిడబ్ల్యుజెఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్షులు పి.నారాయణ తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని ఎపి ఎన్‌జిఒ భవన్‌లో ఫెడరేషన్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కార్యవర్గం తీసుకున్న నిర్ణయాలను మీడియాకు వారు వివరించారు. ఆంధ్ర యూనివర్సిటీ అసెంబ్లీ హాల్‌లో ఈ ఏడాది ఉగాది సంబరాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ రోజు ఉదయం అల్పాహారంతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, కవి సమ్మేళనం, పంచాంగ శ్రవణం, పండిత సత్కారం ఉంటాయని తెలిపారు. హాజరైన జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేక లక్కీ డిప్ ఏర్పాటు చేశామన్నారు. ఈ సంబరాల్లో జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు జి.శ్రీనివాసరావు, పిఎస్.ప్రసాద్, రంగధామం, బి.సీతారామమూర్తి, ఇరోతి ఈశ్వరరావు పాల్గొన్నారు.


ఎన్నికలు పారదర్శకంగా జరగాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరగాలని శాసన మండలి ఎన్నికల పరిశీలకులు సిద్దార్థ్ జైన్ సూక్ష్మ పరిశీలకులకు చెప్పారు. సోమవారం విఎంఆర్‌డిఎ చిల్డ్రన్స్ ఎరీనాలో నిర్వహించిన పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గం ఎన్నికలకు సంబంధించి సూక్ష్మ పరిశీలకుల శిక్షణలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల నియమావళి నియమ నిబంధనలు పక్కాగా అమలు చేయాలని స్పష్టం చేశారు. 48 గంటల ముందు ప్రచారం ముగించాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ ఎలా జరుగుతుందో పరిశీలించాలని పేర్కొన్నారు. వెబ్ కాస్టింగ్, ఫొటోగ్రఫీలను పరిశీలించాలని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్దా వెబ్ కాస్టింగ్, ఫొటోగ్రఫీ ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రంలో పోలింగ్ సిబ్బంది, పోలింగ్ ఏజెంట్లు, ఓటరు మాత్రమే ఉండాలన్నారు. ఓటరు విభిన్న ప్రతిభా వంతులైతే ప్రైసైడింగ్ ఆఫీసర్ అనుమతితోనే 'అటెండెంటు' రావాలని వివరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి ప్రలోభాలూ జరగకుండా చూడాలని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

రంపచోడవరం ఐటిడిఎలో 42 అర్జీలు స్వీకరణ

ప్రజాశక్తి - రంపచోడవరం : స్పందనలో వచ్చిన వ్యక్తిగత, సామాజిక సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు రంపచోడవరం సబ్‌కలెక్టర్ శుభం బన్సల్ వెల్లడించారు. సోమవారం ఐటిడిఎ కార్యాలయ సమావేశ మందిరంలో ఁ ఐటిడిఎ ఎపిఒ జనరల్ సిహెచ్.శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులతో కలిసి నిర్వహించిన స్పందనలో ఏజెన్సీలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి 42 వినతులు స్వీకరించారు. ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు సంబంధించిన సమస్యలను అనేకం అక్కడికక్కడే పరిష్కరించి, మిగిలిన దరఖాస్తుల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు నివేదించినట్లు వెల్లడించారు.



స్పందనలో వినతులు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ శుభం బన్సల్

స్పందనలో వచ్చిన పలు సమస్యలివే..

ఐటిడిఎలో సబ్‌కలెక్టర్ శుభం బన్సల్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందనలో 42 అర్జీలు రాగా, వాటిలో వై రామవరం మండలం ఎగువ ప్రాంతంలో బూసికోట వాగుపై అసంపూర్తి వంతెన పూర్తి చేయాలని అక్కపల్లి కోటేంద్రం దరఖాస్తు సమర్పించారు. మారేడుమిల్లి మండలం బంద నుండి కానివాడ వరకు ఆరు కిలోమీటర్ల రహదారికి సిసి రోడ్డు ఏర్పాటు చేయాలని కానివాడ సర్పంచ్ పల్లాల శిల్పరాణి కోరారు.రాజవొమ్మంగి మండలం లాగరాయి గ్రామంలో ప్రభుత్వ సాయంతో తన పొలంలో బోరు ఏర్పాటుచేసినా విద్యుత్ సౌకర్యం కల్పించలేదని కుంజం చిట్టిబాబు దరఖాస్తు ఇచ్చారు. భూసమస్య పరిష్కరించాలని దేవీపట్నం మండలం శరభవరం గ్రామానికి చెందిన కొమరం జగ్గారావు, ఆర్ఓఎఫ్ఆర్ పట్టాకు సంబంధించిన భూసమస్య పరిష్కరించాలని రంపచోడవరం మండలం పెద్దబారంగి గ్రామానికి చెందిన కంగల రామకృష్ణదొర, పోలవరం ప్రాజెక్టు ముంపుబాధితులకు18ఏళ్ల ఆర్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని దేవీపట్నం మండలం తొయ్యేరు గ్రామానికి చెందిన పోసిపోయిన రాజు దరఖాస్తు సమర్పించారు. కార్యక్రమంలో ఎస్‌డిసి డిఎన్ శాస్త్రి, ఇఇలు నాగేశ్వరరావు. ఎండి యూసఫ్, వెలుగు ఎపిడి ఎ.శ్రీనివాసరావు, . డాక్టర్ రాధిక, వెటర్నరీ డాక్టర్ గోపిక, జిసిసి మేనేజర్ ఎం.నాగరాజారెడ్డి, డిఇఇలు సాయి సతీష్, దుర్గాప్రసాద్, రాజేంద్ర బాబు, ఎ.వెంకటేశ్వరరావు, పిఎఒ రాంబాబు, ఎడిఎ సిహెచ్‌కెవి చౌదరి, గిరిజన సంక్షేమ శాఖ డిడికార్యాలయ సూపరింటెండెంట్ బి. కిషోర్, డివిజినల్ సివిల్ సప్లై అధికారి, సి.శ్రీహరి. సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి యం.సావిత్రి, సిడిపిఒ సంధ్యారాణి. ఎంపిడిఒ ఎంవిఆర్ కుమార్‌బాబు, ఎస్ఒ కబోది,మత్స్యశాఖాధికారి రమేష్, ఎఇ ఎంవి సత్యనారాయణ, డిటిలు తాతారావు. చైతన్య బాబు పాల్గొన్నారు,

157 మందికి కళ్లద్దాల పంపిణీ

ప్రజాశక్తి -సీలేరు: జిల్లాలోని మంగంపాడులో సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరంలో దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించిన 157మంది కంటి రోగులకు సోమవారం ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేసినట్లు సత్యసాయి సేవాసమితి సీలేరు, డొంకరాయి, మోతుగూడెం శాఖల కన్వీనర్ మావూరి శ్రీనివాసరావు వెల్లడించారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఇటీవల మంగంపాడులో మెగా నేత్ర వైద్య శిబిరం నిర్వహించామన్నారు.

సమస్యలపై సిపిఎం నేతల వినతి

ప్రజాశక్తి - కూనవరం : మండలంలోని వరదముంపు బారిన పడిన అన్ని గ్రామాల్లోని బాధితులకు ఆర్ఆర్ ప్యాకేజీ, ముంపునకు గురైన పంటలు, ఆస్తులకు నష్టపరిహారం,వేసవిలో గొంతెండకుండా తాగునీటి సౌకర్యం, రహదారులు, ఇతరత్రా సమస్యలను పరిష్కరించాలని సిపిఎం నేతలు కోరారు. ఈ మేరకు సోమవారం గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. 18ఏళ్ల నిండిన ముంపుబాధితులందరికీ ఆర్ఆర్ ప్యాకేజీ వర్తింప జేయాలని కోరారు. ముంపు బాధిత గ్రామాల్లో తాళ్ల వలస చేర్చాలని కోరారు. .పెదర్కూర్ పంచాయతీలోని బండారిగూడెం, భగవాన్ పురం గ్రామాల్లో మంచినీటి సమస్య వెంటనే పరిష్కరించాలని, కొండాయిగూడెం పాఠశాల భవనం బాగుచేయించాలని, కొండరెడ్ల గ్రామాలకు హాస్టల్ పున్హ ప్రారంభించాలని, .రేపాక కాలనీ నుంచి గండి కొత్తగూడెం బిటి రోడ్డు నిర్మాణం చేపట్టాలని, ఆగిన సచివాలయాలు పున్హ ప్రారంభించాలని కోరారు.దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ ప్రతి ఒక్క సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, సర్పంచులు మడకం నాగమణి, బొగ్గా వెంకమ్మ, ఎంపిటిసి కారం జయసుధ, పార్టీ మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, మేకల నాగేశ్వరరావు, ఎం బాబురావు, హరీష్, బొజ్జరాయి గూడెం గ్రామస్తులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నేతలు



నోటీసు బోర్డులో ఓటర్ల జాబితా పెడుతున్న కార్యదర్శి

ఓటర్ల జాబితా విడుదల

ప్రజాశక్తి - సీలేరు: జీకే వీధి మండలం సీలేరు గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితాను సోమవారం పంచాయతీ కార్యాలయం వద్ద నోటీస్ బోర్డులో పెట్టినట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ వెల్లడించారు. సీలేరు పంచాయతీ సర్పంచ్ కె.పరదేశి గడచిన నవంబర్ 25న మృతి చెందిన నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సర్పంచ్ పదవికి ఉప ఎన్నిక కోసం ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగానే ముసాయిదా జాబితాను సిద్ధం చేసి, ఓటర్ల పరిశీలన కోసం నోటిసు బోర్డులో అంటించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి నోటిఫికేషన్ జారీ చేసిన వెంటనే సర్పంచ్ పదవికి ఉప ఎన్నికకు నిర్వహించేందుకు వీలుగా ఓటర్ల జాబితాను రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పంచాయతీ గుమస్తా సూర్య ప్రకాష్, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ కుసుమ పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మినీ జాబ్‌మేళా

ప్రజాశక్తి - రంపచోడవరం : మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఈ నెల 28న ఉదయం 10గంటలకు ఎపిఎస్ఎస్‌డిసి, సిడిఎపి ఎంప్లాయ్‌మెంట్ ఎక్చేంజ్ సంయుక్త ఆధ్వర్యాన మినీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జి.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. పదో తరగతి, ఆ పై విద్యార్హతలు కలిగిన నిరుద్యోగ యువతీ యువకులంతా జాబ్‌మేళాలో పాల్గొన వచ్చని సూచించారు.

2న జగనన్న గృహ లబ్ధిదారుల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణ వ్యయాన్ని రూ.1.80 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని, టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు స్వాధీనం చేయాలని మార్చి 2న విజయవాడలో సిపిఐ ఆధ్వర్యంలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు విజ్ఞప్తి చేశారు. మహాధర్నా పోస్టర్‌ను సోమవారం పార్టీ నగర కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ.విమల, సిఎన్.క్షేత్రపాల్, జి.రాంబాబు, నాయకులు ఎమ్‌డి.బేగం, జి.ఫణీంద్ర, యు.నాగరాజు పాల్గొన్నారు.

విజెఎఫ్ ప్రోత్సాహక పోటీలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నగరంలోని జర్నలిస్టుల కుటుంబ సభ్యులకు కళారంగ ప్రోత్సాహక పోటీలు నిర్వహిస్తున్నట్లు వైజాగ్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు తెలిపారు. సోమవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ మార్చ్ 7న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమాల వివరాలు వెల్లడించారు. వాట్సాప్ ద్వారా ఈ నెల 28న మధ్యాహ్నం ఒంటి గంట నుంచి నాలుగు గంటలు సమయంలో నగరంలోని జర్నలిస్టుల కుటుంబాల్లోని మహిళలు మాత్రమే తమ ఎంట్రీలను పంపవచ్చని తెలిపారు. గీతాలాపన, రంగవల్లులు విభాగాల్లో ఈ పోటీలు ఉంటాయన్నారు. గీతాలాపన పోటీలో 10 నుంచి 15 సంవత్సరాలులోపు వారిని జూనియర్స్‌గానూ, పదహారేళ్లు పైబడిన వారిని సీనియర్స్‌గానూ పరిగణిస్తున్నట్టు తెలిపారు. న్యాయ నిర్ణేతలు ఎంపిక చేసిన పది మందిని 7వ తేదీన విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో సత్కరిస్తామన్నారు. ఇతర వివరాలకు పోటీల కో-ఆర్డినేటర్ ఆర్.నాగరాజు పట్నాయక్, పి.వరలక్ష్మిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో విజెఎఫ్ కార్యదర్శి దాడి రవికుమార్, ఉపాధ్యక్షులు అర్.నాగరాజ్ పట్నాయక్, కార్యవర్గ సభ్యులు ఇరోతి ఈశ్వరరావు, ఎంఎస్ఆర్.ప్రసాద్ పాల్గొన్నారు.